డిప్యూటీ సర్వేయర్ ఉద్యోగాలను భర్తీ చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలో ఖాళీగా ఉన్న డిప్యూటీ సర్వేయర్ ఉద్యోగాలను టీజీపీఎస్సీ ద్వారా నియమించాలని ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం నిరుద్యోగ జేఏసీ ఛైర్మన్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్ ఆధ్వర్యంలో ఓయూ ఇంజినీరింగ్ కాలేజీ నుంచి ఆర్ట్స్ కాలేజీ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ డిప్యూటీ సర్వేయర్ ఉద్యోగాలను వీఆర్వో, వీఆర్ఏల ద్వారా కాకుండా టీజీపీఎస్సీ ద్వారా బీటెక్, సివిల్ ఇంజినీర్, ఐటీఐ, డిప్లొమా అర్హత గల అభ్యర్థులతో భర్తీ చేయాలన్నారు.

రైల్వేస్టేషన్‌లో ముమ్మర తనిఖీ



సికింద్రాబాద్: గణతంత్ర దినోత్సవ వేడుకలు పురస్కరించుకుని సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు ప్రారంభమయ్యాయి. శుక్రవారం ఆర్‌పీఎఫ్ ఎస్ఐ బీపీ రెడ్డి నేతృత్వంలో ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ పోలీసు బృందాలు రైల్వేస్టేషన్‌లోని ప్రవేశ ద్వారాలు, ప్లాట్‌ఫామ్‌లు, ప్రయాణికుల వెయిటింగ్ హాళ్లలో తనిఖీలు నిర్వహించారు. సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించనున్న నేపథ్యంలో ఈ చర్యలు చేపట్టినట్టు ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ బీఎస్ సారస్వత్ తెలిపారు.

పత్రికలు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పని చేయాలి



కేలండర్ ఆవిష్కరిస్తున్న పీఐబీ అదనపు డైరెక్టర్ జనరల్ శృతి పాటిల్

బన్సీలాల్‌పేట్: పత్రికలు ప్రభుత్వాలకు, ప్రజలకు మధ్య వారధిగా పని చేయాలని కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వశాఖ(పీఐబీ) అదనపు డైరెక్టర్ జనరల్ శృతి పాటిల్ అన్నారు. కవాడిగూడ ప్రధాన రహదారిలోని పీఐబీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు కలకొండ రామక్రిష్ణతో కలిసి కేలండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీఐబీ అదనపు డైరెక్టర్ జనరల్ శృతి పాటిల్ మాట్లాడుతూ ప్రజా సమస్యలు ప్రతిబింబించే విధంగా వార్తా కథనాల ఉండాలని సూచించారు. పీఐబీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మానస్ కృష్ణకాంత్, మీడియా కమ్యూనికేషన్ ఆఫీసర్ వరగంటి గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకురాలు లావణ్య మృతి




లావణ్య మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ బోలక్‌పూర్ ప్రాంతానికి చెందిన బీఆర్ఎస్ నాయకురాలు లావణ్య మరణించారు. అస్వస్థతకు గురైన లావణ్యను గాంధీ ఆసుపత్రిలో చేర్పించారు. గురువారం గుండెపోటు రావడంతో ఆమె మృతి చెందినట్లు కుటుంబీకులు చెప్పారు. ఆమెకు భర్త ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఎమ్మార్పీఎస్ ఇంటింటి ప్రచారం

బన్సీలాల్‌పేట్: వేల గొంతులు....లక్షల డప్పుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ నాయకులు శుక్రవారం బన్సీలాల్‌పేట్ డివిజన్ చాచానెహ్రూనగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మాచర్ల ప్రభాకర్ అధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మంద క్రిష్ణ మాదిగ నాయకత్వంలో ఫిబ్రవరి 7న నగరంలో జరిగే వేల గొంతులు ...లక్షల డప్పులు కార్యక్రమానికి పెద్ద ఎత్తున మాదిగలు డప్పుతో తరలి రావాలని ప్రభాకర్ పిలుపునిచ్చారు.

సుపరిపాలన కోసం అందరూ ఓటు వేయాలి



లాలాపేట: సుపరిపాలన కోసం ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ తమ ఓటును సమర్థవంతంగా వినియోగించుకోవాలనీ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ రిటైర్డు ప్రొఫెసర్ డా. పి. మోహన్‌రావు అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన పాల్గొని కీలక ఉపన్యాసం చేశారు. నిజాయితీ పరులైన నేతలను ఎన్నుకోవడానికి ఓటు అనే అయుధాన్ని వాడాలన్నారు.





ఆకట్టుకున్న సాంస్కృతికోత్సవం

బేగంపేటలోని సెయింట్ ఫ్రాన్సిస్ మహిళా కళాశాలలో శుక్రవారం'ఇండియా: ఏ సింఫనీ ఆఫ్ స్టేట్స్' పేరిట నిర్వహించిన సాంస్కృతికోత్సవం విశేషంగా ఆకట్టుకుంది. విద్యార్థినులు వివిధ రాష్ట్రాల సంప్రదాయ వేషాధారణల్లో సాంస్కృతిక వైభవాన్ని ఆవిష్కరించారు. ఆయా రాష్ట్రాల నృత్యాలు అలరించాయి. దేశంలోని వివిధ ప్రాంతాల ప్రాశస్త్యాన్ని చాటుతూ రూపొందించిన శకటాలను ప్రదర్శించారు. ఆహారం, కళలు, చేతివృత్తులు, జీఐ ట్యాగ్ వంటి తదితర అంశాలు హైలెట్ చేస్తూ ఈ ఉత్సవం కొనసాగింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమా జోసెఫ్, డాక్యుమెంటరీ చిత్ర నిర్మాత జెన్నీఫర్ అల్ఫోన్స్, యాంకర్ రవి హాజరయ్యారు – సనత్‌నగర్

భారత రాజ్యాంగంపై విద్యార్థులకు అవగాహన



భారత రాజ్యాంగంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న బిజేపీ నాయకులు

అడ్డగుట్ట: భారతదేశంలో రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా గణతంత్ర దినోత్సవం ఉత్సవ సంబరాల్లో భాగంగా 'సంవిధాన్ గౌరవ్ అభియాన్' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డివిజన్ బీజేపీ అధ్యక్షురాలు గాజుల సౌందర్య తెలిపారు. అంబేడ్కర్ జీవిత చరిత్రను ప్రతీ ఒక్కరికీ తెలియపరిచే విధంగా కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. ఈ మేరకు శుక్రవారం తుకారాంగేట్‌లోని షిరిడీ సాయిబాబా హైస్కూలులో విద్యార్థులకు అంబేద్కర్ జీవిత చరిత్రను, అదే విధంగా ఆయన రూపొందించిన భారత రాజ్యాంగంలోని విషయాలను విద్యార్థులకు తెలియజేసినట్లు సౌందర్య తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ శ్రీధర్, బిజేపీ నేతలు హంసరాజు, ఉదయ్ యాదవ్, శివాజీ, వెంకటస్వామి, లక్ష్మణ్, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

దినేశ్వర్ కుటుంబాన్ని పరామర్శించిన కేంద్ర మంత్రి



దినేశ్వర్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

బన్సీలాల్‌పేట్: కొండపోచమ్మ డ్యామ్ ఘటనలో మరణించిన విద్యార్థి దినేశ్వర్ కుటుంబాన్ని శుక్రవారం కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి పరామర్శించారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ చాచా నెహ్రూనగర్‌లోని దినేశ్వర్ ఇంటికి వచ్చి ఆయన చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గం కన్వీనర్ టి. రాజశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ గోదామును తరలించండి

సనత్‌నగర్: జనావాసాల మధ్య ఉన్న గ్యాస్ గోదాములను వెంటనే తొలగించాలని అమీర్‌పేట డివిజన్‌లోని రేణుకానగర్‌వాసులు సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కోరారు. శుక్రవారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని కార్యాలయంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను రేణుకానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాలనీవాసులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోననే భయాందోళనతో కాలనీ ప్రజలు జీవిస్తున్నారని వినతిపత్రంలో వివరించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో బీఆర్ఎస్ నాయకులు హన్మంతరావు, సంతోష్ మణికుమార్, బలరాం, జితేందర్ శుక్లా ఉన్నారు.

నాలా పనులు ప్రారంభించాలంటూ కాంగ్రెస్ ఆందోళన



ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ డివిజన్ బోలక్‌పూర్ మేకలమండి ఎదురుగా గాంధీనగర్ ప్రధాన రహదారిలో వరదనీటి నాలా పనులు ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కాంగ్రెస్ నాయకులు ఆందోళనకు దిగారు. డివిజన్ అధ్యక్షులు చిరంజీవి అధ్వర్యంలో నాయకులు సాయి సందీప్, కె. రాజశేఖర్, మధు, మునీర్, హరి, ఆశీష్, సుధాకర్ తదితరులు రోడ్డుపై బైఠాయించారు. మురికినీటి ప్రవాహం వల్ల స్థానిక ప్రజలు తీవ్ర దుర్వాసన, దుర్గంధంతో అవస్థలు పడుతున్నారని చిరంజీవి ఆరోపించారు. ప్రజల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుంటే స్థానిక ఎమ్మెల్యే వాటిని అమలు చేయకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు.

రైల్వే కార్మికులపై పనిభారం తగదు



ఇంజనీరింగ్ కార్మికుల మహాధర్నాలో పాల్గొన్న జోనల్ ప్రధాన కార్యదర్శి శంకర్‌రావు

సికింద్రాబాద్: రైల్వేలో ఇంజినీరింగ్ కార్మికులపై రైల్వే యాజమాన్యం బలవంతపు పనిభారం మోపడం తగదని మజ్దూర్ యూనియన్ జోనల్ జనరల్ సెక్రెటరీ సీహెచ్. శంకర్ రావు అన్నారు. శుక్రవారం సికింద్రాబాద్ సంచాలన్‌భవన్ ముందు మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో మహాధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్‌రావు మాట్లాడుతూ ఇంజినీరింగ్ కార్మికులకు ఆరుగంటల పని విధానంతో రెండు షిఫ్టుల రోస్టర్ పద్ధతిని సత్వరమే అమలులోకి తేవాలని డిమాండ్ చేశారు. మహిళా ఉద్యోగులకు ఇతర విభాగాలలోకి బదిలీ అవకాశాన్ని కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో మజ్దూర్ యూనియన్ జోనల్ అసిస్టెంట్ జనరల్ సెక్రెటరీ ఉదయ భాస్కర్, జోనల్ నాయకులు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దేవరాజ్‌ను అభినందించిన ఎమ్మెల్యే తలసాని



దేవరాజ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ దేవరాజ్‌ను సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ సన్మానించారు. త్వరలో జరగనున్న ఐసీసీ క్రికెట్ టోర్నమెంట్‌కు భారత జట్టుకు మేనేజర్‌గా నియమితులైన సందర్భంగా దేవరాజ్ శుక్రవారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని కార్యాలయంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

రోడ్డు విస్తరణ వద్దు



డిప్యూటి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జేఏసీ నాయకులు

రసూల్‌పురా: నగరంలో ఎక్కడా లేని విధంగా రాజీవ్ రహదారిలో 200 అడుగుల రోడ్డు వెడల్పు కారణంగా వేలాది కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి నెలకొందని రోడ్డు విస్తరణ బాధితుల జేఏసీ ఛైర్మన్ తేలుకుంట సతీష్‌గుప్త అన్నారు. తిరుమలగిరి టీచర్స్‌కాలనీ కమ్యూనిటీ హాలులో డిప్యూటీ కలెక్టర్ ఆపర్ణ ఆధ్వర్యంలో రోడ్డు విస్తరణ బాధితులతో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ అధ్వర్యంలో వందలాది మంది ర్యాలీగా వెళ్ళి రోడ్డు విస్తరణను రెండువందల అడుగుల నుంచి వంద అడుగులకు తగ్గించాలని డిప్యూటీ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

కూరగాయల ధరలు..

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో.. రూపాయల్లో..) టమాటా 11, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 28, బెండకాయ 40, పచ్చిమిర్చి 45, బజ్జీమిర్చి 28, క్యాప్సికమ్ 38, పచ్చకాకర 38, పందిరి బీర 35, క్యాబేజీ 19, క్యారెట్ 19, దొండ 35, గుండుబీన్స్ 40, గింజ చిక్కుడు 45, గోకరకాయ 28, కీర 23, దోసకాయ 18, బీట్‌రూట్ 19, ఉల్లిగడ్డ 30, ఆలుగడ్డ 26, చామగడ్డ 40, మొరంగడ్డ 28.

జెక్‌కాలనీలో రేపు ఫుడ్ ఫెస్టివల్



సమావేశంలో జెక్‌కాలనీ నాయకులు మల్లు ప్రసాద్, రాజశేఖర్ చందు తదితరులు

సనత్‌నగర్: జెక్‌కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 26న ఫుడ్ ఫెస్టివల్‌ను నిర్వహించనున్నట్లు ఫెడరేషన్ అధ్యక్షుడు మల్లు ప్రసాద్, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ చందు తెలిపారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ.. కాలనీలోని మహాత్మాగాంధీ పార్కు వద్ద జరిగే ఈ ఫుడ్ ఫెస్టివల్‌లో 120 రకాల వంటకాలతో మహిళలు ఫుడ్ స్టాల్స్‌ను ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు. సాయంత్రం 5 నుంచి రాత్రి 10.30 వరకు ఫుడ్‌స్టాల్స్ కొనసాగుతాయని, అలాగే సాయంత్రం 5.30 నుంచి 7.30 వరకు గీతాలాపనలు, నృత్యాలు వంటి సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయన్నారు. రాత్రి 8 నుంచి 10.30 గంటల వరకు తంబోలా ఉంటుందన్నారు.

ఉత్సాహంగా స్పోర్ట్స్‌మీట్



లాలాపేట: ఆల్ ఇండియా ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్–2025 ఆధ్వర్యంలో శుక్రవారం తార్నాకలోని సరోజిని నాయుడు వనితా ఫార్మసీ మహా విద్యాలయంలో ప్రత్యేకంగా విద్యార్థినులకు గేమ్స్, స్పోర్ట్స్ మీట్‌ను ఘనంగా నిర్వహించారు. ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షులు కె. నిరంజన్ ముఖ్య అతిథిగా హాజరై క్రీడా పోటీలను ప్రారంభించారు. నగరలోని పది కళాశాలల నుంచి 330 మంది విద్యార్థినులు పోటీల్లో పాల్గొన్నారు. వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, టెన్నికాయిట్,చెస్, క్యారమ్స్, టేబుల్ టెన్నీసు, షాట్‌పుట్, లాంగ్ జంప్, రన్నింగ్ తదితర పోటీలో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఫార్మసీ మహా విద్యాలయం ఛైర్మెన్ ప్రభా శంకర్ విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కన్వీనర్ మంజిత్‌రెడ్డి, అనీల్ మిశ్రా,సుదీర్ చక్రవర్తి, మల్లికార్జున్‌రెడ్డి తదితరులున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగిస్తున్న ఏసీపీ సంపత్‌కుమార్

సికింద్రాబాద్: వాహనాలను నడిపే వ్యక్తులు ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను పూర్తిగా నివారించవచ్చునని ఈస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ సంపత్‌కుమార్ చెప్పారు. శుక్రవారం చిలకలగూడ ట్రాఫిక్ పీఎస్ పరిధిలోని ప్రధాన రహదారుల్లో పలు వాహనాల డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలుగడ్డబావి జంక్షన్ వద్ద నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కూడళ్ల వద్ద సిగ్నళ్లు జంప్ చేయడం, స్టాప్‌లైన్ల వద్ద వాహనాలను నిలుపకపోవడం ద్వారా పలు ప్రమాదాలు జరిగి వాహనదారులు మృత్యువాత పడుతున్న తీరును వివరించారు చిలకలగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.శ్రీనివాసులు, ట్రాఫిక్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దశలవారీగా సమస్యలను పరిష్కరిస్తున్నాం



శాస్త్రినగర్‌లో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి

అడ్డగుట్ట: డివిజన్‌లో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తున్నామని కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి అన్నారు. శుక్రవారం శాస్త్రినగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ సహకారంతో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు. పనుల్లో జాప్యం కనబరచకుండా అధికారులు త్వరితగతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ తివారీ, బీఆర్ఎస్ నేతలు లింగాని శ్రీనివాస్, నక్క మధు, మనోహర్, అమర్, వసంత, ఎల్లయ్య, మహ్మద్, మల్లేష్, దేవయ్య, శ్రీరామ్, రామస్వామి, విజయ, అంజమ్మ, భాగ్య, రజిని తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే బాలికల జీవితాల్లో వెలుగు

పద్మారావునగర్: విద్యాభివృద్ధి ద్వారానే బాలికల జీవితాల్లో వెలుగు చూడగలమని పలువురు వక్తలు పేర్కొన్నారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా శుక్రవారం సాయంత్రం బన్సీలాల్‌పేట్ డివిజన్ చాచానెహ్రూనగర్ కమ్యూనిటీహాల్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రెయిన్‌బో కమ్యూనిటీ కేర్ అండ్ లెర్నింగ్ సెంటర్‌లో జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రెయిన్‌బో ఇన్‌ఛార్జీ సుజాత, కో-ఆర్డినేటర్ సంధ్యారాణి, ఎడ్యుకేటర్ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.



ఇంజినీరింగ్ విద్యార్థులకు మరో కొత్త హాస్టల్ భవనం



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీ బీటెక్ విద్యార్థుల కోసం మరో కొత్త హాస్టల్ భవనం ముస్తాబవుతుంది. గత వీసీ ప్రొ.రవీందర్ హయంలో ప్రారంభమైన హాస్టల్ భవన నిర్మాణం పనులు పూర్తి కావోచ్చాయి. రూ.30 కోట్లతో 4 అంతస్తుల్లో నిర్మితమవుతున్న భవనంలో 500 మంది విద్యార్థులకు వసతి కల్పించనున్నట్లు అధికారులు తెలిపారు.

బేగంపేట కార్పొరేటర్ హౌస్ అరెస్ట్

సనత్‌నగర్: ప్రజలకు ఉపయోగపడాల్సిన ప్రభుత్వ స్థలాలను వేలం పాట వేయడాన్ని బీఆర్ఎస్ శ్రేణులు నిరసిస్తున్న నేపథ్యంలో ఆందోళనలకు దిగుతారన్న సమాచారం మేరకు బీఆర్ఎస్ శ్రేణులను శుక్రవారం ముందస్తు అరెస్టులు చేశారు. బేగంపేట కార్పొరేటర్ టి.మహేశ్వరిశ్రీహరిని బయటకు వెళ్లకుండా తెల్లవారుజామునే మయూరిమార్గ్‌లోని ఆమె నివాసానికి చేరుకుని హౌస్ అరెస్టు చేశారు. పనులు ఉన్నాయని బయటకు వెళ్లాలని ఎంతగా చెప్పినా పోలీసులు ఆమెను బయటకు పంపించలేదు.

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు



సనత్‌నగర్: ఆల్విన్ సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో కరెంటు సరఫరా ఉండదని గ్రీన్‌ల్యాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఇండస్ట్రియల్ ఎస్టేట్ ఫీడర్ పరిధిలోని సనత్‌నగర్ ఇండస్ట్రియల్ ఏరియా, డీ-మార్ట్ ఏరియా, టయోటా షోరూం లేన్, స్కోడా షోరూం లేన్, జెన్ టెక్నాలజీ ఏరియా, ఆంధ్రాబ్యాంక్ లేన్ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందని పేర్కొన్నారు.

యువతి అదృశ్యం

రసూల్‌పురా: ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన యువతి అదృశ్యమైంది. కార్ఖాన పోలీసులు తెలిపిన మేరకు.. సిక్‌విలేజ్ గాంధీనగర్‌లో నివాసం ఉండే కనకరాజు కుమార్తె కాంచన (21) గత నెల 21న బయటికి వెళ్ళి ఇంటికి తిరిగి రాలేదు. బంధువులు, స్నేహితుల ఇళ్ళల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఇంటర్ విద్యార్థి అదృశ్యం



శరణ్

రాంగోపాల్‌పేట్: ఇంటర్ చదువుతున్న ఓ విద్యార్థి అదృశ్యమయ్యాడు. గోపాపలపురం పోలీసులు తెలిపిన మేరకు.. కర్ణాటక రాష్ట్రం కాలబుర్గికి చెందిన బసవరాజు కుమారుడు శరణ్ (19) రాంగోపాల్‌పేట్‌లోని ఆద్య ఎగ్జిక్యూటివ్ బాయ్స్ హాస్టల్‌లో ఉంటూ వెస్లీ జూనియర్ కాలేజీలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. డిసెంబర్‌లో ఇంటికి వెళ్లి తిరిగి ఈ నెల 4వ తేదీన హైదరాబాద్ వచ్చాడు. ఆ తరువాత తల్లిదండ్రులు ఫోన్ చేస్తే స్పందించకపోగా తర్వాత స్విచ్ఛ్ ఆఫ్ వచ్చింది. ఈ నెల 14న ఇద్దరు అక్కలకు స్నేహితుడి ఫోన్ ద్వారా బెంగూళూరులో జాబ్ కోసం వచ్చినట్లు మెసేజ్ చేశారు. 22కు హైదరాబాద్‌కు వస్తున్నట్లు చెప్పినా ఆ తర్వాత అతను ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తుంది. దీంతో తండ్రి శుక్రవారం రాంగోపాల్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసికున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

కరుణాకర్ రావుకు తెలుగు తేజం అవార్డు ప్రదానం



ఉస్మానియా యూనివర్సిటీ: తెలుగు సాహిత్య రంగంలో విశేష ప్రతిభ కనబరచిన హైకోర్టు న్యాయవాది యెలుచూరి కరుణాకర్ రావు తెలుగు తేజం జాతీయ విశిష్ట సాహితీ పురస్కారాన్ని అందుకు కున్నారు. ఇటీవలి తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమి బుక్ ఆఫ్ రికార్డ్స్, వరల్డ్ రైటర్స్ ఫోరం, వరల్డ్ పోయెట్రీ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో విజయవాడలో జరిగిన కార్యక్రమంలో శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ సీఈఓ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నట్లు తెలిపారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

రసూల్‌పురా: కంటోన్మెంట్ బోర్డు పరిధిలో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బంది పడుతున్నారని, బోర్డు నామినేటేడ్ సభ్యులు జే. రామకృష్ణ అన్నారు. రసూల్‌పురా 105 గల్లీలో బోర్డు నిధులతో చేపట్టే సీసీ రోడ్డు పనులకు రామకృష్ణ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అన్ని వార్డుల్లోని బస్తీలు, కాలనీల్లో తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు తనకు ఫిర్యాదులు చేస్తున్నారని ప్రజలకు సరిపడా నీరు సరఫరా చేయడంలో కాంగ్రెస్ రాష్ట ప్రభుత్వం విఫలమైందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు శ్రవణ్, మాదరపు అశోక్, చిట్టిబాబు, శ్యామ్, మమత, జై యాదవ్ పాల్గొన్నారు.

ముగ్గురు అంతర్రాష్ట్ర గంజాయి రవాణా దారుల అరెస్టు

సికింద్రాబాద్: విశాఖపట్నం నుంచి సికింద్రాబాద్ మీదుగా తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాలకు గంజాయి రవాణా చేస్తున్న రెండు ముఠాల గుట్టును సికింద్రాబాద్ రైల్వే పోలీసులు రట్టు చేశారు. రెండు కేసుల్లో ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. వీరి నుంచి 21 కిలోల గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. జీఆర్‌పీ డీఎస్‌పీ ఎస్ఎన్ జావెద్, ఇన్‌స్పెక్టర్ బి.సాయీశ్వర్‌గౌడ్ తెలిపిన కథనం ప్రకారం... చెన్నైకి చెందిన మణి, అస్లం విశాఖ పట్నం వెళ్లి 13 కిలోల గంజాయి ప్యాకెట్లతో విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలులో సికింద్రాబాద్ చేరుకున్నారు. చెన్నై వెళ్లేందుకు 2వ నెంబర్ ప్లాట్‌ఫామ్‌పై వేచిఉన్నారు. ట్రైన్ సమయం తెలుసుకునేందుకు మణి బయటకు వెళ్లగా.. గంజాయి బ్యాగులు పట్టుకుని ప్లాట్‌ఫామ్‌పై వేచిఉన్న అస్లం పోలీసులకు పట్టుబడ్డాడు. పరారీలో ఉన్న మణికోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

మరో కేసులో..

ఒడిశాకు చెందిన మిథున్‌సేథి (33), పాండవ్ నాయక్ (60)లు తమ రాష్ట్రం నుంచి గుజరాత్ రాష్ట్రం సూరత్‌కు గంజాయి తరలించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. 8 కిలోలగంజాయి బ్యాగులను తీసుకుని వచ్చిన ఇరువురు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో పోలీసులకు చిక్కి కటకటాలపాలయ్యారు.